ప్రజాశక్తి

మంగళవారం 4 మార్చి 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

పంట చేతికొచ్చిన వేళ..

ధరల పతనం

- దిగజారిన ధాన్యం, మిర్చి, శనగ ధరలు
- కొనుగోళ్లలో ప్రభుత్వం పాత్ర నామమాత్రం
- ఆందోళన చెందుతున్న రైతులు



మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని కలెక్టర్‌కు విన్నవిస్తున్న రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పంట చేతికొచ్చిన వేళ అన్ని రకాల వ్యవసాయోత్పత్తుల ధరలు దిగజారుతున్నాయి. రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట సాగు సమయంలో ఉన్న ధరలు దిగుబడి సమయాల్లో ఉండటం లేదు. ఒక వైపు విదేశీ దిగుమతులు ప్రభావం.. మరో వైపు ఇక్కడ వ్యాపారుల కూటమి వెరసి రైతులను ముంచుతున్నాయి. మార్కెట్‌లో ప్రభుత్వం పాత్ర లేదు. కొనుగోళ్ల సంస్థలు ఉన్నప్పటికీ వాటి పాత్ర నామమాత్రంగా ఉంది. మార్కెట్ కమిటీలు నియోజకవర్గానికొకటి ఉన్నాయి. వాటికి ఛైర్మన్లు, పాలకవర్గాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటి నుంచి ఏమీ కొనడం లేదు. మార్కెట్ సెస్‌లు వసూలు చేసుకొని శాఖ నడవడం తప్ప రైతులకు ఏ మేలూ లేకుండా పోయింది. మార్కెట్ కమిటీలు అలంకారప్రాయంగా ▶ 2లో

నేటి ఉదయానికి తుది ఫలితం.!

- కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల లెక్కింపు
- ఆధిక్యతలో ఆలపాటి
- 25 మంది అభ్యర్థులలో కనీస ఓట్లు దక్కించుకోని వారు 23 మంది..

ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

శాసనమండలి కృష్ణా, గుం టూరు జిల్లాల పట్టభద్రుల నియో జకవర్గానికి గత గురువారం జరిగిన ఎన్నికల్లో పోలయిన ఓట్ల లెక్కింపు సోమవారం స్థానిక ఎసి కళాశాలలో నిర్వహించారు. సోమవారం రాత్రి 10.30 గంటలకు నాలుగు రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్త యింది. మొత్తం 9 రౌండ్లలో లెక్కింపు చేపట్టారు. మొదటి నాలుగు రౌండ్ల లెక్కింపులో టిడిపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ ఆధిక్యతతో కొన సాగుతున్నారు. తన సమీప ప్రత్యర్థి పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుపై ఆయన 38,491 ఓట్ల ఆధిక్యతతో గెలుపు దిశగా పయనిస్తున్నారు. మొదటి రౌండ్ నుంచి ఆలపాటి తన ఆధిక్యతను చాటుకుంటున్నారు. నాలుగు రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి టిడిపి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ 38,491 ఓట్ల ఆధిక్యత సాధించారు. నాలుగు రౌండ్ల లెక్కింపు పూర్తయ్యే సరికి ఆలపాటికి 67,679 ఓట్లు రాగా పిడి ఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు 29,188 ఓట్లు వచ్చాయి. ఒక్కో రౌండ్‌లో 28 టేబుల్స్‌కు 28 వేల ఓట్ల చొప్పున లెక్కిస్తున్నారు. ప్రతి రౌండ్‌లో సగటున 10 శాతం ఓట్లు చెల్ల కుండా పోయాయి. మంగళ వారం ఉద యం వరకు ఓట్ల లెక్కింపు కొనసాగు తోంది. నాలుగు రౌండ్లలో ఓటు సరిగా ▶ 2లో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రౌండ్ల వారీగా వచ్చిన ఓట్లు

లెక్కింపు రౌండ్	టిడిపి	పిడిఎఫ్	చెల్లని ఓట్లు
మొదటి రౌండ్	17,194	7214	3070
రెండో రౌండ్	17,527	6742	3005
మూడో రౌండ్	16,722	7404	2978
నాల్గో రౌండ్	16,236	7828	3035

8న సిఎం రాక

మార్కాపురంలో చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 8న మార్కాపురం రానున్నారు. ఈ విషయాన్ని సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్ సోమవారం రాత్రి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో సిఎం పాల్గొంటారని సమాచారం. అనంతరం తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అవుతారని ఆ పార్టీ నేతలు చెప్పారు.

వెలుగు ఏపీఎం చీకటి పనులు

- మహిళా సిబ్బంది పట్ల అసభ్యకర ప్రవర్తన
- కార్యాలయాన్నే బార్‌గా మార్చేస్తున్న ప్రబుద్ధుడు
- వేధింపులపై దోర్నాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు



ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వెలుగు కార్యాలయంలో పనిచేసే పనిచేసే ఏపీఎం కీచకపర్వం సోమవారం వెలుగుచూసింది. సదరు ఏపీఎం కార్యాలయంలో పనిచేసే మహిళా సిబ్బంది పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. తన మాట వినని వారిని వేధింపులకు గురిచేస్తున్నాడు. అతని వేధింపులు తాళలేక కార్యాలయంలో పనిచేసే ఓ మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దోర్నాలలోని వెలుగు కార్యాలయంలో పనిచేసే ఏపీఎం పోలయ్యకు ఆడిందే ఆటగా..పాడిందే పాటగా చలామణి అవుతోంది. లంచం ఇవ్వనిదే ఏ పనీ చేయడని ఈయనకు పేరుంది. వెలుగు కార్యాలయాన్ని బార్‌గా మార్చేశాడు. కార్యాలయంలోనే కూర్చొని మద్యం సేవించడం, అక్కడే పడుకోవడం చేస్తున్నాడు. అప్పుడప్పుడూ బయటి మహిళలను తీసుకొచ్చి.. అక్కడే గడుపుతుంటాడని స్థానికులు చెబుతున్నారు. డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలను ▶ 2లో

కావలెను

ప్రజాశక్తి దినపత్రిక

ఆఫీస్ సెక్రటరీ

విద్యార్హత : ఇంటర్, డిగ్రీ

MS.Office, Computer పరిజ్ఞానం ఉండాలి.

బయోడేటా క్రింద తెలిపిన email కు పంపగలరు

➡ నైట్ వాచ్‌మెన్

ప్రజాశక్తి కార్యాలయం

NH-16, మోటూరు హనుమంతరావు భవన్, ఏడుగుండ్లపాడు, ఒంగోలు

email : prajasaktigmongole@gmail.com

ఇంటర్వ్యూ తేదీ : 07-03-2025 ఉదయం 11 గం.లకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ : 94900 99 239

ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్

ఉపాస హాస్పిటల్స్ వారి రెండవ యూనిట్

"పేద మరియు మధ్య తరగతి ప్రజలకు ఇప్పుడు మన ఉపాస హార్ట్ కేర్ సెంటర్ నందు"

డా॥ఎన్.టి.ఆర్ వైద్య సేవలు ప్రారంభం

అందించు వైద్య సేవలు

కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, జనరల్ సర్జరీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, ఆప్తమాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్స్, పోలీట్రామా, కార్డియో థొరాసిక్ సర్జరీ, ఇ.ఎన్.టి, జెనిటో యూరినరి సర్జరీ

24/7 Emergency Services

వివరములు కొరకు

సంతపేట,ఒంగోలు.

7207950542,7207950543

బాలికల హక్కుల పరిరక్షణ

అందరి బాధ్యత

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- ఒంగోలులో కొవ్వొత్తులతో ర్యాలీ

కొవ్వొత్తుల ర్యాలీలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బాలికలు స్వేచ్ఛగా ఎదిగేలా వారి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న వారోత్స వాలలో భాగంగా సోమవారం ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జిజిహెచ్) నుంచి నెల్లూరు బస్టాండు సెంటర్ వరకూ నిర్వహిం చిన క్యాండిల్ ర్యాలీని ఆమె ప్రారం భించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వారోత్సవాలలో భాగంగా ప్రతిరోజూ ఒక ఇతివత్తంతో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే 'బాల్యవివాహాల రహిత ప్రకాశం జిల్లా' ఆవిష్కరణ ▶ 2లో

పంట చేతికొచ్చిన వేళ.. ధరల పతనం

(మొదటిపేజీ తరువాయి)

మారాయి. ప్రస్తుతం మార్కెట్‌లోకి వచ్చిన మిర్చి ధరలు పతనమయ్యాయి. క్వింటా ధర ఇప్పుడు రూ.12 వేలకు పడిపోయింది. ఇంకా తగ్గితే ప్రభుత్వం కొనుగోలు చేయాలనే ఆలోచనలో ఉంది. ఇటీవల వరకూ క్వింటా రూ.20 వేల వరకూ ఉంది. మార్కెట్‌లో మిర్చి ధరల పతనం తీవ్ర కలకలం రేపుతోంది. రైతుసంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నాడు రైతులు ధర్నా చేశారు. క్వింటాకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా లేక మిర్చి సాగు కూడా తగ్గిపోయింది. సాధారణ విస్తీర్ణం 6,787 హెక్టార్లు ఉండగా 3,806 హెక్టార్లలోనే సాగయింది. కోస్తా మండలాలతో పాటు మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల్లో మిర్చి సాగు ఉంది. ఎకరాకు లక్ష రూపాయలు పైగానే పెట్టుబడి పెట్టారు. అన్ని రకాల ఇబ్బందులు పడి పంటలను పండించారు. కాయలు కోశారు. మార్కెట్‌లోకి తీసుకుపోగానే ధరలు పడిపోయాయి. గుంటూరు మిర్చి యార్డుకు తీసుకుపోతే ఎంతకు కొంటారో తెలియడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక ధాన్యం కూడా వచ్చేసింది. ఈ పాటికే ప్రైవేటు వ్యాపారులు కారుచౌకగా పొలాల్లోనే కొనేశారు. రైతు భరోసా కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. వ్యాపారులు నేరుగా కల్లాల్లోకి వచ్చి కొన్నారు. బీపీటీ 75 కిలోల బస్తా రూ.1600కు కొంటున్నారు. ఈ ధాన్యం నుంచి 50 కిలోల వరకూ బియ్యం వస్తాయి. ఇప్పుడు పాతిక కిలోల బియ్యం రూ.1500కు పైగానే ధర ఉంది. అంటే రైతు నుంచి రూ.1600కు ధాన్యం కొనుగోలు చేసి వాటిని మర వేసుకొని బియ్యంగా మార్చుకుంటే వారికి రూ.3500 వరకూ వస్తున్నాయి. సగానికి సగం లాభం వ్యాపారులు, మిల్లర్లు పొందుతున్నారు. ఎల్‌ఆర్ రకం ధాన్యం బస్తా రూ.1500కు కొంటున్నారు. సాగర్ ప్రాంతంలో తక్కువ ధరలకే ధాన్యం ఇచ్చేస్తున్నారు. ఎఫ్‌సిఐ వంటి సంస్థలు కొనుగోలు కేంద్రాలు పెట్టి ధాన్యం సేకరించాల్సి ఉంది. అటువంటి చర్యలు లేవు. శనగలు దిగుబడికి వచ్చాయి. కోతలు, నూర్పిడులు మొదలయ్యాయి. వీటి ధరలు కూడా పడిపోయాయి. మొన్నటి వరకూ దేశీయవాణి ఎర్రశనగలు క్వింటా రూ.8 వేలు వరకూ ఉండగా ఇప్పుడు రూ.5 వేలకు పడిపోయాయి. తెల్ల శనగలు ధర క్వింటా రూ.10 వేలకు పైనే ఉండగా ఇప్పుడు దాని ధర రూ.6 వేలకు వచ్చింది. దిగజారుతున్న ధరలు చూసి శనగ రైతులు లబోదిబోమంటున్నారు. అన్ని రకాల పంటల ధరలూ దిగజారుతున్నాయి. పాలకపక్షం మాత్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు పంటల ధరలపై ఆందోళనలు చేశారు. పొగాకు కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. గత ప్రభుత్వంపై ఆందోళనలు చేపట్టారు. ఇప్పుడు వాటిని తలుచుకున్న పాపాన పోవడం లేదు. ప్రస్తుతం అసెంబ్లీ జరుగుతున్నందున ధరలపై సభ్యులు మాట్లాడాలి. రైతులు నష్టపోకుండా కాపాడాలి.

వెలుగు ఏపీఎం చీకటి పనులు

(మొదటిపేజీ తరువాయి)

రుణాలిప్పిస్తానంటూ మాయ చేసి.. మోసం చేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. కార్యాలయంలో పనిచేసే మహిళా సిబ్బందితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఎవరైనా మహిళలు వ్యతిరేకిస్తే వారిని ఇబ్బందులకు గురిచేయడం, వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటం చేస్తున్నాడు. చాలామంది మహిళలు, మహిళా సిబ్బంది కార్యాలయానికి వచ్చిన సందర్భంలో వారి చేయి పట్టుకోవడం, వారి పక్కనే కుర్చీ వేసుకొని కూర్చోవడం, వారిపై చేతులు వేయడం చేస్తున్నాడు. విషయం తెలిసినా ఆ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ కార్యాలయంలో పనిచేసే ఓ మహిళ పట్ల ఏపీఎం అసభ్యకరంగా ప్రవర్తించడం, ఆమె ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానమివ్వడం చేశాడు. దీనికి సంబంధించిన వీడియో సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఏపీఎం వేధింపులకు గురిచేయడంతో తట్టుకోలేక సదరు మహిళ తన భర్తకు తెలిపింది. ఆమె భర్త వచ్చి ఏపీఎంను ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన ఏపీఎం ఆమె భర్తపై చేయి చేసుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏపీఎంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

శనగ రైతుకు తప్పని నష్టాలు

తగ్గిన దిగుబడులు.. దిగజారిన ధరలు

ప్రారంభమైన శనగ నూర్పిళ్లు

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని వేడుకోలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఈఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో శనగ సాగు ఆలస్యం అయినప్పటికీ పైర్లు పచ్చగా కళకళలాడంతో మంచి ఫలితాలు వస్తాయని రైతులు ఆశించారు. కానీ రైతుల ఆశలు అడియాసలయ్యాయి. శనగకు తెగుళ్ల ఆశించడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో రైతన్నలు నిరాశకు గురయ్యారు. ఎకరానికి దున్నకం, విత్తనాలు పురుగుమందులు, కోత నూర్పిళ్ళు అన్నీ కలిపి ఎకరానికి 42 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం శనగ పంట నూర్పిళ్ళు ప్రారంభం అయ్యాయి. ఎకరానికి 5 బస్తాలకు మించి వచ్చే పరిస్థితి లేదు. విత్తనం వేసేటప్పుడు ఎర్రశనగలు రూ.7 వేల ధర ఉండగా ఇప్పుడు రైతుల వద్దకు సరుకు వచ్చే సమయానికి ఒక్కసారిగా ధరలు దిగజారి రూ.5,500కు పడి పోయింది. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం చూస్తే ఎకరానికి రూ.27,500 మించి రావటంలేదు. దాంతో రైతులు ఎకరానికి రూ.15 వేల వరకు నష్టపోయే

శనగ నూర్పిళ్లు చేస్తున్న దృశ్యం

పరిస్థితి ఉంది. గత ఏడాది కన్నా సాగు విస్తీర్ణం తగ్గింది. దీంతో దిగుబడులు తగ్గినప్పటికీ ధరలు ఆశాజనంగా ఉంటాయని, కొద్దిమేర అయినా నష్టం తగ్గుతుందని రైతులు ఆశించారు.

కానీ ధరలు ఒక్కసారిగా దిగజారడంతో రైతాంగానికి ఆ ఆశలు కూడ సన్నగిల్లి దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన గోగినేని నాగేశ్వరరావు అనే రైతు 9 ఎకరాలు నూర్పిడి చేయగా 50 క్వింటాలు దిగుబడి వచ్చింది. పెట్టుబడి రూ.3.60 లక్షల వరకు అయింది. వచ్చిన దిగుబడి ప్రస్తుతం ఉన్న ధర ప్రకారం చూస్తే రూ.3 లక్షలకు మించి వచ్చే పరిస్థితి లేదు. దీంతో రూ.60 వేలకు పైగా నష్టం వచ్చే పరిస్థితి ఉంది. ఉప్పుగుండూరుకు చెందిన దాసరి శ్రీనివాసరావు అనే రైతు 7 ఎకరాల్లో ఎర్రశనగ సాగుచేసారు. ఎకరానికి రూ.30 వేల దాకా పెట్టుబడి పెట్టారు. 7 ఎకరాలకు రూ.2.10 లక్షలు అయ్యింది. ప్రస్తుతం కోతకు వచ్చింది. మధ్యలో తెగుళ్ల సోకి ఎకరానికి 4 బస్తాలు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి కనపడంలేదు. దీంతో ఎకరానికి 22 వేల చొప్పున 7 ఎకరాలకు రూ.1.50 లక్షలు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈయనకు రూ.60 వేల వరకు నష్టం వచ్చే పరిస్థితి ఉంది. ఏదేమైనా ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఒకపక్క వెంటాడగా, తెగుళ్ళ మరోప్రక్క, దిగుబడులు ఘననీయంగా తగ్గి ధరలు పతనం అవడంతో శనగ రైతాంగం నష్టాల చవిచూడక తప్పడంలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే గిట్టుబాటు అయ్యే విధంగా ధరలు కల్పించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

ఆశాజనకంగా మొక్కజొన్న

ప్రజాశక్తి - పంగులూరు

ఈ ఏడాది వివిధ పంటలు సాగు చేసిన రైతులు రైతులు నష్టాల ఊబిలో కూరుకు పోతున్నారు. అయితే రబీ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. పొగాకు, మిర్చి, శనగ, వరి తదితర పంటలు దిగుబడి బాగా వచ్చినా రైతులకు నష్టాలు తప్పడం లేదు. పంగులూరు మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో అధికారుల లెక్కల ప్రకారం (ఈ- క్రాప్ చేయించుకున్నది) మూడు వేల ఐదు వందల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. అనధికారంగా మరో 1500 ఎకరాల్లో సాగుచేశారు. మొత్తం ఐదు వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ప్రతి ఏటా మొక్కజొన్నకు కత్తెర పురుగు పెద్ద గండంగా మారేది. ఈ సంవత్సరం రబీ పంటలో కత్తెర పురుగు ప్రభావం ఏమీ కనిపించలేదు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. దిగుబడి కూడా ఎకరాకు 35 నుండి 45 క్వింటాల వరకూ వస్తుందని రైతు చెబుతున్నారు. ప్రస్తుతం ధర క్వింటా ధర రూ.2,200

ఏపుగా పెరిగిన మొక్కజొన్న

పలుకుతుంది. రాబోవు రోజుల్లో మరికొంత పెరిగే అవకాశం ఉందనిరైతులు చెబుతున్నారు. గత సంవత్సరం కూడా క్వింటా రూ. 2,800 పలికింది.ఎకరానికి పెట్టుబడి రూ.30 వేల రూ.35 వేలు వరకు అవుతుంది. దీన్ని బట్టి చూస్తే తమకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు. కౌలు రైతులకు కూడా లాభాలే వస్తాయని చెబుతున్నారు.

ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

నేటి ఉదయానికి తుది ఫలితం.!

(మొదటిపేజీ తరువాయి)

వేయని 12,088 ఓట్లు చెల్లలేదు. నాలుగు రౌండ్లలో 1,12,297 ఓట్ల లెక్కింపు జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. తొలుత జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎన్నికల పరిశీలకులు వి.కరుణ పర్యవేక్షణలో బ్యాలెట్ బాక్సులను తెరిచారు. మొత్తం ఓట్లను 50 చొప్పున కట్టలుగా కట్టి తరువాత లెక్కింపు ప్రారంభించారు. పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు, టిడిపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. మొత్తంగా టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థులకు తప్ప మిగతా అభ్యర్థులు ఎవ్వరికి నాలుగు రౌండ్లలో కలిపి కనీసం వెయ్యి ఓట్లు కూడా రాలేదు. మొత్తం 2,41,502 ఓట్లు పోలయినట్లు ప్రకటించిన అధికారులు నిబంధనల ప్రకారం 50 శాతం కన్నా ఒక్క ఓటు అదనంగా వచ్చే వరకు విజేతను ప్రకటించే అవకాశం లేదు. 1,20,752 ఓట్లు వస్తే మొదటి ప్రాధాన్యతతో గెలుపొందినట్లు ప్రకటిస్తారు. మొత్తం 25 మంది అభ్యర్థుల్లో టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థులు తప్ప మిగతా వారంతా డిపాజిట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.

తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న చెన్నకేశవరావు

శునకాల నుంచి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-కంభం

కంభం మండలంలోని కందులాపురం, కంభం గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని షెడ్యూల్డ్ కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కాటమల చెన్నకేశవరావు కంభం తహశీల్దారు వి కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చికుక్కలు స్కూలుకు పోయే పిల్లలపై, వృద్ధులపై, వాహనాల మీద పోయే వారిపై దాడిచేసి గాయపరుస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పిచ్చికుక్కల బెడదను తగ్గించి ప్రజలకు రక్షణ కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

కృష్ణ కిషోర్ రెడ్డి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలంలోని అనుమలపల్లె గ్రామంలో శ్రీ జీవన మూర్తి స్వామి ఆలయంలో నిర్వహించిన 16 రోజుల పండుగ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణ కిషోర్ రెడ్డికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాలికల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

కోసం ప్రజలలో చైతన్యం కలిగించేలా ఈ క్యాండిల్ ర్యాలీని చేపట్టినట్లు తెలిపారు. కనీసం 18 ఏళ్లు నిండే వరకూ ఆడపిల్లలకు వివాహం చేయకుండా వారిని చదివించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ సూచించారు. బాల్యవివాహం చేసుకోబోనని ప్రతి ఆడపిల్ల కూడా సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. బాలికల ఆరోగ్యం, హక్కులను కాపాడేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, పలువురు సిడిపిఒలు, అంగన్వాడీ వర్కర్లు, ఆశాలు, ఏఎన్ఎంలు, మహిళలు, నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్తికి సంబంధించిన దస్తావేజు కనబడటం లేదు

కాకొల్లు వెంకటనరసయ్య గారి కుమారుడు కాకొల్లు శ్రీనివాసరావు అను నేను ప్రకాశం జిల్లా, ఒంగోలు టౌన్, ఎన్.జి.ఓ కాలని నివాసం ఉంటున్నాను. నా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు అయిన సంతనూతలపాడు సబ్‌రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్టరు కాబడిన దస్తావేజు నెం.1465/2005ను జిరాక్స్ తీసుకొనుటకుగాను పోవు చుండగా, కర్నూలు బైపాసు రోడ్డులో పోయినవి. కావున ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనను దొరికిన ఎడల మా చిరునామాకు గాని లేదా క్రింది ఫోన్ నెంబర్‌కు గాని తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

ఇట్లు.. కాకొల్లు శ్రీనివాసరావు, తండ్రి కాకొల్లు వెంకటనరసయ్య, ఫ్లాట్ నెం.202(ఎ), శ్రీపద్మావతి అపార్టుమెంట్, ఎన్.జి.ఓ కాలని, ఒంగోలు. సెల్ : 9490330444

లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం

యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

గాయపడిన రాజు

ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాలలోకి వెళితే.. వినుకొండ మండలం పెద్దకంచెర్ల గ్రామానికి చెందిన రాజు చందోలు వ్యక్తిగత పనులపై ఒంగోలు వెళ్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. స్థానికులు 108కి సమాచారం అందించడం తో క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరేళ్ల బాలికపై బాలుడి అత్యాచారం

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఆరేళ్ల బాలికపై మైనర్ బాలుడు అత్యాచారం చేసిన ఘటనపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటుండగా స్థానిక మైనర్ బాలుడు బాలికకు మాయ మాటలు చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. సంఘటన జరిగిన తరువాత బాలిక ఏడుస్తూ ఇంటికి రాగా, బాలిక ఒంటిపై రక్తపు మరకలు చూసిన బాలిక నాయనమ్మ వెంటనే బంధువుల సహకారంతో తెనాలి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలిక నాయనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెరుకుపల్లి ఎస్ఐ అనిల్ కుమార్ పోక్సో కేసు నమోదు చేశారు. రేపల్లె డీఎస్పీ ఆవల శ్రీనివాసరావు సోమవారం గ్రామానికి వచ్చి విచారించారు. తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మహిళా పోలీస్ సిబ్బంది బాలికను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటన అనంతరం బాలుడు పరారీ అయినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-కొండపి

పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 8 మంది జూదరులను అరెస్టు చేసిన సంఘటన మండలంలోని పెరిదేపి, ముప్పరాజుపాలెం గ్రామాల మధ్య పొలాలలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రేమకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెరిదేపి, ముప్పరాజుపాలెం గ్రామల మధ్య పొలాలలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిఐ జి.సోమశేఖర్, ఎస్ఐ ప్రేమ్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.16,170 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. సీఎస్ డిటిలు ఏ అబ్రహాం, సిహెచ్ సురేష్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కోనంకి సమీపంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాన్ని నిలిపి పరిశీలించగా అందులో 80 బస్తాలు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని వలపర్లలోని శ్రీ లక్ష్మి శ్రీనివాస రైస్ మిల్లులో భద్ర పరిచారు. ఆటోని మార్టూరు పోలీస్ స్టేషన్‌లో స్వాధీనపరిచి బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీఐ మాదినేని శేషగిరిరావు అధికారులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనధికారిక అమ్మకాలు చేయొద్దు

పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-టంగుటూరు

అనధికారికంగా పొగాకు అమ్మకాలు కానీ కొనుగోళ్లు కానీ చేయరాదని పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. టంగుటూరు వేలం కేంద్రంలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు బేళ్లలో వార్తా పత్రికలు, ప్లాస్టిక్ పేపర్లు, ఏ ఇతర అన్య పదార్థాలు రాకుండా చూసుకోవాలన్నారు. టంగుటూరు వేలం కేంద్రంలోని మొత్తం 27 గ్రామాలను 12 ఆక్షన్ క్లస్టర్స్‌గా విభజించినట్లు తెలిపారు. 1వ క్లస్టర్‌గా చింతలపాలెం, దావగూడూరు గ్రామాలు, 2వ క్లస్టర్‌లో కాకుటూరివారిపాలెం, తూర్పునాయుడుపాలెం, 3వ క్లస్టర్‌లో గొర్లమిట్ట, మల్లవరప్పాడు, మట్టిపాడు, శివపురం, 4వ క్లస్టర్‌లో చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం, 5వ క్లస్టర్‌లో జమ్ములపాలెం, తుమాడు, 6వ క్లస్టర్‌లో కె.ఉప్పలపాడు, 7వ క్లస్టర్‌లో పొందూరు, 8వ క్లస్టర్‌లో ఆలకురపాడు, అనంతవరం, జయవరం, పాలేటిపాడు, రావివారిపాలెం, 9వ క్లస్టర్‌లో కారుమంచి, 10వ క్లస్టర్‌లో సాదువారిపాలెం, టంగుటూరు, వావిలేటిపాడు, జరుగుమల్లి, 11వ క్లస్టర్‌లో ఎం.నిడమలూరు, 12వ క్లస్టర్‌లో కమ్మువారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు రైతులు, రైతు నాయకులు, ఫ్లోర్ కమిటీ సభ్యులు, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-పొన్నలూరు

మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్టీ కాలనీలో సోమవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా తల్లిదండ్రులకు బాల్యవాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించి, ధైర్యంగా పెంచాలని అలాగే చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు అరికట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎమ్మెస్కేలు, అంగన్‌వాడీ టీచర్లు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

అప్కాస్ రద్దును ఉపసంహరించుకోవాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్ర ప్రభుత్వం అప్కాస్ విధానం రద్దుచేసి, ప్రయివేట్ కాంట్రాక్ట్ వ్యవస్థ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని ఏ. పి. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు యస్. డి.సర్దార్ డిమాండ్ చేశారు. ఏ.పి.మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్మికులని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పడం సరికాదని ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రైవేట్ ఏజెన్సీలు కార్మికులకు వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐలు సరిగా చెల్లించరని శ్రమదోపిడీకి గురవుతారని పేర్కొన్నారు. శ్రీరామ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో కార్మికుల సమస్యలు తీర్చటంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాసర్, ఆదినారాయణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకి 36 వేల రూపాయలు జీతం అమలు చేయాలని, కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా సమితి తరపున డిఆర్ఓ ఓబులేసుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిబాబు, కిరణ్, శేషయ్య, చెన్నయ్య, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి, పి.నాయుడుపాలెం విద్యుత్తు సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డిఈఈ మోహన్ రావు తెలిపారు. దీనివల్ల చీమకుర్తి టౌన్, మంచికలపాడు, పి.నాయుడుపాలెం, పాటిమీద పాలెం, బండ్లమూడి, ఎర్రగుడిపాడు, తొర్రగుడిపాడు గ్రామాలలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-రేపల్లె

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని రేపల్లె ఎక్సైజ్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. రేపల్లె పట్టణంలోని కూరగాయలు మార్కెట్ వెనుక అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ సీఐ దివాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజశ్రీ, సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న జనసేన నాయకులు

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-వేమూరు

జనవాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ తెలిపారు. స్థానిక కార్యాలయంలో జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణి అని తెలిపారు. సమస్యలు ఉంటే జనవాణిలో అర్జీ అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ చైర్మన్ శివ శంకర్, రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, కార్యాలయ కన్వీనర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-కొండపి

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొండపి మండలంలోని నేతివారిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రేమకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నేతివారిపాలెం గ్రామానికి చెందిన వల్లపు జ్యోతి (19) తల్లి సుమారు 2 నెలల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి ఎవరితో మాట్లాడకుండా ఇంటి వద్దనే ఉంటోంది. ఈ నేపథ్యంలో మనస్తాపంతో సోమవారం మధ్యాహ్నం సమయంలో తన ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-బాపట్ల

పట్టణంలోని సూర్యలంక రోడ్డులో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు రాజస్థాన్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పట్టణంలో ఏజీ కాలేజీ రోడ్డులో స్టేట్ బ్యాంక్ వద్ద ఓ సెల్ షాపులో పని చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

దగ్ధమైన పైపులను చూపుతున్న బాధితుడు

నీటి పైపులు తగలబెట్టారు..

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలోని సూరవరపుపల్లి గ్రామంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలాలకు నీళ్ల కట్టుకునే పైపులను పెట్రోల్ బోసి తగలబెట్టారు. అర్ధరాత్రి 12 గంట సమయంలో ఓ మహిళ మంచి మంచినీటి కోసం లేచిన సమయంలో పెద్ద ఎత్తున మంటలు రావడాన్ని గమనించి పక్క ఇంట్లో వారికి సమాచారం ఇచ్చింది. స్పందించిన గ్రామస్తులు చెరువులోని నీటితో మంటలను ఆర్పి వేశారు. రాత్రి సమయాలలో ఇలాంటి ఘటనలు జరగటంపై గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నష్టపోయిన రైతు గుంజి పాపారావు కన్నీటి పర్యంతం అయ్యారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. ఘటన జరిగిన సమయంలోనే గ్రామ సర్పంచ్ వెంకటప్పయ్య పోలీసులుకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సోమవారం పరిశీలించారు.

కాలిపోయిన వరిగడ్డి

అగ్ని ప్రమాదంలో వరిగడ్డి దగ్ధం

ప్రజాశక్తి-పర్చూరు

మండలంలోని వీరన్నపాలెంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పంచాయతీ కార్యాలయం ముందు నుంచి వెళుతున్న వరి గడ్డి ట్రాక్టర్‌కు రోడ్డుపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వరి గడ్డి పూర్తిగా కాలిపోతున్న తరుణంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించాడు. గడ్డిని ప్రక్కన పడేసి అందులో ఉన్న కూలీలను, ట్రాక్టర్‌ను కాపాడాడు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వరమ్మ

ప్రజాశక్తి-బాపట్ల

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వరమ్మ పిలుపునిచ్చారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.విజయమ్మకు సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్లు సమాజంలో విస్తతమైన సేవలు అంది స్తున్నారన్నారు. కోవిడ్ కాలంలో వారి చేసిన కృషిని వైద్య ఆరోగ్యశాఖ గుర్తించిందన్నారు. ప్రాణాలకు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

తెగించి కోవిడ్‌లో సేవలందించిన ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. 2023 డిసెంబర్‌లో ఆశా వర్కర్స్‌తో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న రాష్ట్ర కమిటీ చలో విజయవాడకు పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆశా వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆశావర్కర్లకు సెలవులు మంజూరు చేయాలన్నారు. వేతనాలను పెంచాలన్నారు. గ్రాడ్యూటీ అమలు చేయాలన్నారు. ఆశా వర్కర్లకు ఎఎన్ఎం శిక్షణ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. మజుందర్ ,ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు ఎస్.కృష్ణవేణి, కెవి.శిరీష, ఎం. మహాలక్ష్మి, ఎ.ఇందిర ,ఎం.సునీత తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వేమూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర తిని క్రిస్టినా, హార్వెస్ట్ ఇండియా అధ్యక్షుడు, భట్టిప్రోలు కెఎస్‌కె విద్యాసంస్థల సిఇఒ కత్తెర సురేష్ కుమార్ కుమార్తె వివాహ వేడుకలు సోమవారం నిర్వహించారు. తెనాలిలోని చావాస్ గ్రాండ్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పలువురు నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. హార్వెస్ట్ ఇండియా సంస్థ, కెఎస్‌కె విద్యాసంస్థల ద్వారా పేద విద్యార్థులను విద్యను అందిస్తున్న బిషప్ సురేష్ కుమార్, హేని క్రిస్టినా సేవలను ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు.

సిడిపిఒగా ఝాన్సీ

ప్రజాశక్తి - వేటపాలెం

సిడిపిఒ ఝాన్సీ

ఇంకొల్లు సిడిపిఒ ఝాన్సీ వేటపాలెం సిడిపిఒగా సోమ వారం అదనపు బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీలను సమన్వయం చేసుకొని ప్రగతి పథంలో నడిపేందుకు కషి చేస్తానని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే కిషోర బాలికల తల్లిదండ్రులు, అంగన్‌వాడీలు నేరుగా తన దష్టికి తీసుకు రావాలన్నారు. గతంలో వేటపాలెం సిడిపిఒగా విధులు నిర్వహించిన ఖాజా ఉమ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆమె స్థానంలో ఝాన్సీ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిడిపిఒను కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు జూనియర్ అసిస్టెంట్ మున్నంగి రామచంద్రరావు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

పత్రాలు ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-వేటపాలెం

ఎఐఫర్ నెక్స్‌ట్ జెనరేషన్ ఇంజినీరింగ్ అప్లికేషన్స్‌పై ఫ్యాక్టలీ డెవలప్‌మెంట్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు సోమవారం తెలిపారు. ఎఐ ఫర్ నెక్స్‌ట్ జెనరేషన్ ఇంజినీరింగ్ అప్లికేషన్స్‌పై ఫ్యాక్టలీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వరంగల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారి సహకారముతో నిర్వహిస్తున్నట్లు కళాశాల పిన్సిపల్ కె. జగదీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి టి. కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గెస్ట్ ఆఫ్ హానర్స్ వరంగల్‌కు చెందిన ఇసిఇ డిపార్ట్‌మెంట్, నీట్ ప్రతినిధి శ్రీహరి రావు, టి. కిషోర్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - చిన్నగంజాం

రాజమాత కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని సిపిఎం చీరాల ఏరియా కమిటీ నాయకుడు జి. ప్రతాప్ కుమార్ డిమాండ్ చేశారు.రాజమాత కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ తహశీల్దారు జివిగుంట ప్రభాకర్ రావుకు బాధితులలో కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా మొండిబండ కులానికి చెందినవారు కాగితాలు, డబ్బాలు, వెంట్రుకలు, పాస్టిక్ వస్తువులు, పాత ఇనుప సామగ్రి సేకరిస్తున్న జీవనం సాగిస్తునవ్నట్లు తెలిపారు. సొంత ఇళ్లు లేక వారు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు.ఇళ్ల స్థలాల కోసం వారు అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారికి పట్టాలు ఇచ్చి పక్క గ్రామాలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జివి. రాంప్రసాద్, సిహెచ్. శ్రీనివాసరావు రాజమాత కాలనీ వాసులు కత్తుల బొజ్జ ఆంజనేయులు, మావెళ్ళ రాము, పెద్దికుల మహ లక్ష్మి, శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, వైద్యసిబ్బంది

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి -పర్చూరు

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని డాక్టర్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని ఉప్పుటూరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై సోమవారం అవగాహన కల్పించారు. అంటువ్యాధుల గురించి బోధించారు. అంటు వ్యాధులు ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి వివిధ వాహకాల ద్వారా సంక్రమిస్తాయని తెలిపారు. దోమల ద్వారా డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియాసిస్, జపనీస్ యాన్సిఫలిటీస్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత పరిసుభ్రత లేక పోవడం, చేతులు సరిగా కడుక్కోక పోవడం, కలుషిత మంచినీరు, ఆహారం వల్ల టైఫాయిడ్, కలరా, కామెర్లు, ఫుడ్ పాయిజింగ్ వంటి వ్యాధులు సంక్రమిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్‌కె.వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వేమూరు

జలజీవన్ మిషన్ పై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ మిషన్ ద్వారా వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ విజయ్ కుమార్‌తో కలసి ఎమ్మెల్యే జాతీయ జల జీవన్ మిషన్ పథకం ద్వారా రాబోయే వేసవి కాలంలో వేమూరు నియోజకవర్గం లో నీటి ఎద్దడి నివారణకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి వివరించారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రతి ఇంటికి స్వచ్ఛ తాగు నీరు పంపిణీ కార్యక్రమానికి వేమూరు నియోజక వర్గంలో మండలాల వారిగా ప్రతిపాదనలు అందజేశారు. అమర్తలూరు మండలం రూ.561.30 లక్షలు ,భట్టిప్రోలు మండలంలో రూ. 137.00 లక్షలు ,కొల్లూరు మండలం రూ.15.89 లక్షలు ,చుండూరు మండలంలోరూ. 123.80 లక్షలు ,వేమూరు మండలంలో 216.78 లక్షలు కలిపి మొత్తం 1054.77 లక్షల పనులు కు త్వరలో టెండర్లు పిలిచి వేసవి కాలం మొదలయ్యే లోపల పనులు డిఇ విజయ్ కుమార్ ఆనందబాబుకు హామీ ఇచ్చారు.

పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న ఎఎస్‌పి విఠలేశ్వర్

పరీక్షా కేంద్రాలను సందర్శించిన ఎఎస్‌పి

ప్రజాశక్తి - చీరాల

ప్రశాంత వాతావరణంలో సీనియర్ ఇంటర్ పరీక్షలు జరిగేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా అడిషనల్ ఎస్‌పి టిపి.విఠలేశ్వర్ తెలిపారు. చీరాల లోని ఎకెపి అండ్ పికె జూనియర్ కళాశాల, విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను అడిషనల్ ఎస్‌సి సోమవారం స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష పూర్తయిన తరువాత సీల్ వేసిన సమాధాన పత్రాలను తగిన ఎస్కార్ట్‌తో సంబంధిత కార్యాలయాలకు చేర్చాలని ఆదేశించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 36 పరీకా కేంద్రాలలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఎస్‌పి తుషార్ డూడి ఆదేశాల మేరకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో వుందన్నారు. పరీక్ష కేంద్రాలలోకి ప్రవేశించే ప్రతి ఒక్క అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతిస్తున్నట్లు ఆయన తెలిపారు.

'ఎకెయు పరిశోధక నిబంధనావళి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిశోధక నిబంధనావళి పుస్తకం స్కాలర్లకు ఎంతో ఎంతగానో ఉపకరిస్తుందని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డివిఆర్ మూర్తి అన్నారు. సోమవారం నాడు ఆంధ్ర కేసరి యూనివర్శిటీలో పరిశోధనల కోసం చేరిన స్కాలర్లకు, రీసెర్చ్ డైరెక్టర్లకు దిక్సూచిగా ఉపయోగ పడనున్న " ఆంధ్ర కేసరి యూనివర్శిటీ పరిశోధక నిబంధనావళి " పుస్తకాన్ని ఉపకులపతి డి.వి.ఆర్. మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు తదితరులు లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి.సి.ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ ఈ పరిశోధక పుస్తకం యూనివర్శిటీ పరిధిలో నూతనంగా పరిశోధక విద్యార్థులుగా చేరిన రీసెర్చ్ స్కాలర్లకు, అదే సమయంలో రీసెర్చ్ గైడ్లకు ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. అంతే కాకుండా యూనివర్శిటీ పరిధిలో రీసెర్చ్ విభాగంలో భవిష్యత్ అవసరాల కోసం ఈ నిబంధనావళి అందరికీ మార్గ దర్శకంగా పని చేస్తుందని తెలిపారు. ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ ఆంధ్ర కేసరి యూనివర్శిటీ పరిధిలో పరిశోధకులకు, పరిశోధనలో భాగస్వాములుగా ఉన్న రీసెర్చ్ డైరెక్టర్లను దృష్టిలో ఉంచుకుని పూర్తి స్థాయిలో నిబంధనలను పేర్కొంటూ తయారు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ పరిధిలో గల ఏ.కే.యూ ప్రాంగణంతోబాటు మరో మూడు పరిశోధనా కేంద్రాల ద్వారా వివిధ అంశాలలో మొత్తం 52 మంది పరిశోధక విద్యార్థులు చేరి తమ పరిశోధనలను కొనసాగిస్తున్నట్లు ఆంధ్రకేసరి యూనివర్శిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.నిర్మలామణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్, ఏ.కే.యూ రీసెర్చ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ గుత్తి రాజ మోహన్ రావు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.నిర్మలా మణి, ఏ.కే.యూ సి.డి.సి డీన్ ప్రొఫెసర్ సోమ శేఖర తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరిస్తున్న యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డివిఆర్ మూర్తి

ఎరువులు తయారీ వివరిస్తున్న దృశ్యం

వానపాముల ఎరువుతో భూములు సారవంతం

ప్రజాశక్తి-కొండపి

వాన పాములు నేలను సారవంతంగా చేస్తాయని జిల్లా ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం వి.సుభాషిని అన్నారు. సోమవారం కొండపి మండలంలోని కొండపి రైతు సేవా కేంద్రంలో 20 రకాల విత్తనాలతో విత్తన శుద్ధి చేసి 100 పీఎండీఎస్ కిట్లను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఎండిఎస్ విత్తనాలు నేలలో చల్లడం వలన తొలకరి వర్షాలకు నేలలో విత్తనాలు పెరిగి వానపాములు నేలను సారవంతంగా తయారు చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ మనోజ్, ఎంటీ ఎస్తేర్, యూనిట్ ఇంచార్జ్ మందాకిని మాధవ ఐసిఆర్పీలు జోత్స్న, మాలకొండయ్య, గౌతమి, వివిఏ వెంకటనారాయణ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెవి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-బాపట్ల

ప్రతి ఒక్కరూ చెవి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకొని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్. విజయమ్మ తెలిపారు. ప్రపంచ వినికిడి దినోత్సవం పురస్కరించుకొని ఆరోగ్య సిబ్బందికి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వినికిడి లోపంతో ఎదురయ్యే సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శబ్దాలతో వెలువడే ధ్వని కాలుష్యం నుంచి చెవిని కాపాడుకునేందుకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వరల్డ్ హియరింగ్ డే సందర్భంగా సోమవారం ప్రముఖ చెవి, ముక్కు, గొంతు, అలర్జీ వైద్య నిపుణులు డాక్టర్ వి శేఖర్ నాయక్ రోగులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. వినికిడి సమస్యలపై అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టుకతో వినికిడి లోపం వస్తే చిన్నారులు భాష నేర్చుకోలేక, మూగ, చెవిటివారిగా మారిపోతారని తెలిపారు. వినికిడి లోపం వల్ల మానసిక రుగ్మతలు సైతం పెరుగుతాయన్నారు. అల్జీమర్స్ వ్యాధి సోకుతోందని తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు

సత్తా చాటిన జార్జి కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక జార్జి ఫార్మసీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఎం.యాస్మిన్ బేగం, టి.యశోదలక్ష్మి, షేక్ ఆసిఫా, బి.కాత్యాయని సత్తా చాటారు. గత నెల 28వ తేదీన నేషనల్ సైన్స్ డే సందర్భంగా గుంటూరులోని చలపతి ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ఐడియేషన్‌లో టాప్ టెన్‌లో ఓరల్ ప్రజెంటేషన్ విభాగంలో ప్రతిభ కనబరిచారు. ఈ విషయాన్ని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.రాజాజయ రావు సోమవారం తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ విజేతలను అభినందించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 261 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. రెండో సంవత్సరం పరీక్షకు 270 మంది హాజరు కావాల్సి ఉండగా అందులో 9 మంది గైర్హాజరు అయ్యారని ఆయన తెలిపారు.

ప్రదర్శనలు తిలకిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీచైతన్యలో వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక టంగుటూరులోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో సోమవారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు రకరకాల ప్రయోగాలను ప్రదర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ వి.వి రమణ, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.వెంకాయమ్మ, డైరెక్టర్ వివి రాజసింహ, వత్తిపాటి బ్రహ్మానందం పాల్గొని విద్యార్థుల ద్వారా ప్రదర్శించబడిన అన్ని వైజ్ఞానిక విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతిలోని విద్యార్థులను ప్రోత్సహించి వారి ద్వారా ప్రాజెక్టులను చేయించిన సైన్స్ ఉపాధ్యాయులైన పుణ్యహర్ష, షేక్ చిన్న సాహెబ్, సుమతి, వాసవి ప్రియాంకలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సైన్స్ ఫెయిర్‌ని తిలకించారు.

అన్నదానం చేస్తున్న దాతలు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సాగర్ హోటల్ అధినేత దేవారెడ్డి తిరుపతిరావు మూడో వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు దేవారెడ్డి శరత్ బాబు ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో వృద్ధులకు ఒకరోజు మూడు పూటలా పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించారు. శివం సంచార వాహనం ద్వారా ఒంగోలు నగరంలోని 300 మంది అనాథలకు, యాచకులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మానవతా సేవాసంస్థ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, సినీ నటులు దన్నారపు మస్తానావు, డాక్టర్ గోదాసు నాగేశ్వరరావు, సంజీవి, కొపోలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగులను వేధిస్తే సహించం

రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అశోక్ బాబు

ప్రజాశక్తి-టంగుటూరు

దళిత ఉద్యోగులను వేధిస్తే సహించమని రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అశోక్ బాబు అన్నారు. సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ సునీల్ సునీల్ కుమార్‌ని సస్పెండ్ చేసిన నేపథ్యంలో రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం, దళిత రైట్స్ ఫెడరేషన్, అంబేద్కర్ ఇండియా మిషన్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా తుల్లిబిల్లి అశోక బాబు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతితో తన సొంత ఖర్చులతో విదేశాలకు వెళ్లినా కేసు నమోదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. భవిష్యత్తులో దళితులందరూ ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం, దళిత రైట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు టి.క్రాంతి కుమార్, ఏఐఎం ప్రకాశం జిల్లా అధ్యక్షులు కసుకుర్తి అగమనరాజు, శ్రీధర్, ప్రశాంత్, కార్తీక్, ప్రదీప్, శ్రీను, నవీన్, విజయ్, భరత్, బాలకోటయ్య, అభిషేక్, రాజేష్ పాల్గొన్నారు.

పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబుకు సన్మానం

ప్రజాశక్తి-పొన్నలూరు

పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు బదిలీ అవుతున్న సందర్భంగా రైతులు ఘనంగా సన్మానించారు. సోమవారం దూబగుంటలోని పొగాకు బోర్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పొన్నలూరు నుంచి పలువురు రైతులు మరియు పొగాకు బోర్డు సిబ్బంది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు చేసిన మంచి పనులను కొనియాడారు. అద్దంకి శ్రీధర్ బాబు రైతులకి గత 2 సంవత్సరాల కాలంలో ఎటువంటి పెనాల్టీ లేకుండా అధికంగా పండించిన పొగాకును అమ్మించుట ద్వారా దాదాపు రైతులకు 100 కోట్లు పైగా లాభం చేకూర్చారని తెలిపారు. ఇన్సూ రెన్స్ 2 లక్షల నుంచి 6 లక్షల పెంచడంలో ఆయన కృషి చేశారన్నారు. పొగాకు బోర్డు ఆధునీకరణకు కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ పొగాకు రైతులకు సేవ చేసుకునే అవకాశం దొరికినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. సహకరించిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు, వేలం నిర్వహణ అధికారి కేవీ రామాంజనేయులు, కందుకూరు – 1,2 వేలం నిర్వహణ అధికారులు ఎమ్.కిరణ్ , బి.చంద్ర శేఖర్, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్లు శివ కుమార్, రాజ్ గోపాల్‌చ పొగాకు బోర్డు సిబ్బంది, రైతు నాయకులు తాటికొండ రమణయ్య, గుండాల కొండారెడ్డి, వడ్లమూడి రామకృష్ణ, పొగాకు రైతులు పాల్గొన్నారు.



అద్దంకి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న రైతులు

కొండపి:

రైతులు కష్టం తెలిసిన వ్యక్తి పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అని పొగాకు బోర్డు రైతులు, రైతు నాయకులు తెలిపారు. సోమవారం పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు బదిలీ అవుతున్న సందర్భంగా స్థానిక పొగాకు బోర్డు ఆవరణలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ఒక మొక్కను నాటారు. అధికారులతో అంతర్గత సమావేశం నిర్వహించి రాబోయే 2025 వేలం సీజనకు సంబంధించిన పనులు మరియు సంసిద్ధతను గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు అందరు మాట్లాడుతూ బదిలీపై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పొగాకు బోర్డులో రైతులకు 7 సంవత్సరముల నుండి చేసినటు వంటి సేవలను గుర్తి కొనియాడారు. గత మూడు సంవత్సరాల నుంచి పొగాకు రైతులకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చేశారని కొనియాడారు. గతంలో పొగాకు రైతులు అమ్మిన బేళ్లను 14 రోజులలో రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగేదని ఈడీ దానిని 9 రోజులకే కుదించడం జరిగిందన్నారు. గత సంవత్సరంలో 17.5 మిలియన్ల పొగాకును కొండపి వేలం కేంద్రంలో అమ్మకాలు జరిపారని కానీ ఎక్కువ రోజులు వేలం నిర్వహించడం వలన రైతుల దగ్గర ఉండే పొగాకు నాణ్యత లోపిస్తుందని అన్నారు. అనంతరం అద్దంకి శ్రీధర్ బాబుకి పుష్పగుచ్ఛాలు, శాలువలు మరియు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, ఒంగోలు ఆర్‌యం లక్ష్మణ రావు, గుంటూరు వేలం నిర్వహణాధికారి కె.రామంజ నేయులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎంఎల్ఎ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

వివాహ వేడుకల్లో డాక్టర్ బూచేపల్లి

ప్రజాశక్తి - దర్శి

ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో దర్శికి చెందిన న్యాయవాది వడ్డమాని శ్రీనివాసశాస్త్రి, వెంకట నాగ భారతి కుమారుడు సత్య భరద్వాజ శర్మ, లలిత వివాహ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అంతకు ముందు డాక్టర్ కడియాల లలిత సాగర్ కూడా నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పిఎసిఎస్ మాజీ చైర్పర్సన్ కలవకలను శేఖర్ బాబు తోపాటు తెలుగుదేశం, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - కనిగిరి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని 8వ వార్డు మసీద్ పరిసర ప్రాంతాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని అన్ని మసీదుల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఇంటి చుట్టుపక్కల చెత్త, వ్యర్థ పదార్థాలు లేకుండా ఉండుట వల్ల దోమల నిర్మూలన చేయవచ్చని అన్నారు. మురికినీరు ప్రవహిస్తున్న ప్రదేశాల్లో శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులుకు సూచించ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న పివి శేషయ్య

రైల్వే బాధితులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - కనిగిరి

నడికుడి, శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు మండలంలోని పేరంగుడిపల్లిలో ఇండ్లు కోల్పోతున్న బాధితులకు పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు పివి శేషయ్య జిల్లా ఉన్నతాధికారులను కోరారు. రైల్వే బాధితులను ఆయన సోమవారం కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిహారం చెల్లించకుండా నివాసాలు కూల్చివేస్తామంటూ అధికారులు వెళ్ళటం భయాందోళనకు గురి చేయడమేనని అన్నారు. అలాంటి పరిస్థితి తగదన్నారు. ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న వారికి ఆధారం లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఇప్పటికైనా బాధితులకు పరిహారం చెల్లించాలని కోరారు. శాసన సభ్యులు కూడా చొరవ చూపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

'మీకోసం' అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- మీకోసం కార్యక్రమానికి అర్జీల వెల్లువ
- సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజలనుండి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే ఆర్జీలపై సంబందిత శాఖల అదికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకష్ణతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మీ కోసం' కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తుండటంతో ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. అర్జీలకు అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని చెప్పారు. ఎట్టి పరిస్థితిల్లోనూ ఆర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్ లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని సూచించారు. సాంకేతిక సమస్యల వలన క్షేత్రస్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టం చేయాలని అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ బి చిన ఓబులేసు, డిప్యూటి కలెక్టర్లు జాన్సన్, పార్ధసారధి, వరకుమార్, విజయజ్యోతి పాల్గొన్నారు.

మీ కోసం కార్యక్రమానికి హాజరైన అర్జీదారులు, వివిధ శాఖల అధికారులు

ఎంఎస్ఎంఇ సర్వేపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి

- అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో జరుగుచున్న ఎంఎస్ఎంఈ సర్వే, పి - 4 సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా మున్సిపల్ కమిషనర్లను, ఎంపిడిఓలను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫెరెన్స్ హాలు నుండి ఆమె సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి, గృహ నిర్మాణాల పురోగతి, ఎంఎస్ఎంఈ సర్వే, పి-4 సర్వే, మిస్సింగ్ సిటిజన్స్ మ్యాపింగ్, సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య ఏర్పాట్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, స్కూల్ టాయిలెట్స్ తనిఖీ తదితర అంశాలపై మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, ఏపిఒలతో వీక్షణ సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ సర్వే ఈ నెల 15లోపు, పి -4 సర్వే ఈ నెల 4లోపు పూర్తి చేయాలని అన్నారు. గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారులు వేగంగా ఇళ్ళు నిర్మించుకునేందుకు చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్లను త్వరగా మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది 100 శాతం బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు బయోమెట్రిక్ హాజరుపై ప్రతి రోజు మానిటరింగ్ చేయాలని ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి 90రోజుల పని దినాలు లక్ష్యం మేరకు కల్పించాలని ఎంపిడిఓలను ఆదేశించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షిస్తూ, ఎంపిడిఒలు, ఏపిడిలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఉపాధి హామీ పనులను పర్యవేక్షించడంతో పాటు కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పటిష్టంగా అమలు జరిగేలా ఎంపిడిఓ పూర్తి బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో జడ్పీ సిఈఓ చిరంజీవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాల శంకరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ శ్రీనివాసరావు, డిపిఒ జి వెంకటనాయుడు, డ్వామా పీడీ జి జోసఫ్ కుమార్, సిఎఒ డి వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బేబీ రాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు పాల్గొనగా క్షేత్ర స్థాయి నుండి మున్సిపల్ కమిషనర్లు, డిఎల్‌డిఒలు, ఎంపిడిఓలు, ఈఓపిఆర్‌డిలు, ఏపిఓలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి పాల్గొన్న అధికారులు

హెల్మెట్ ధరించడం పట్ల నిర్లక్ష్యం వద్దు

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

కొద్దిపాటి నిర్లక్షమే రోడ్డు ప్రమాదాల్లో తీరని లోటు మిగులుస్తుందని అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ ప్రజలను హెచ్చరించారు. మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా డాక్టర్ శిఖేంద్రనాథ్ ఫౌండేషన్ నిర్వాహుకుల సహకారంతో జిల్లా పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు ద్విచక్ర వాహనాలపై వచ్చే మహిళా సిబ్బందికి కార్యాలయంలో ఆయన హెల్మెట్‌లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబంలో ఎంబిబిఎస్ చదివి ఎండి పీజీ కోర్సుకు శిక్షణ తీసుకుంటూ రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ లేని కారణంగా మత్యువాత పడిన ఘటనను తలచుకుంటే ఎంతో ఆవేదనగా ఉందన్నారు. రోడ్డు ప్రమాదం కారణంగా తమ కుటుంబంలో జరిగిన ఘోర ఘటన వేరొకరికి జరగకూడదు అనే ఉద్దేశంతో చంద్ర ప్రసాద్, చంద్ర మాధవీలత తమ కుమారుడి పేరుతో డాక్టర్ శిఖేంద్రనాథ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వీరి కుటుంబంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనను దష్టిలో ఉంచుకుని ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని కొద్దిపాటి నిర్లక్ష్యమే రోడ్డు ప్రమాదాల్లో తీరని లోటును మిగులుస్తుందన్నారు. రోడ్డు ప్రమాదం అనేది ఒకరితో పోదని వారిపై ఆధారపడిన కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందన్నారు. కొంతమంది హెల్మెట్ ఉన్న దానిని తలకు ధరించకుండా ద్విచక్ర వాహనానికి తగిలించి పోలీసులు కనపడినప్పుడు చలనాలు విధిస్తారనే భయంతో వారి ముందు హెల్మెట్ దరిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు స్వీయ క్రమశిక్షణ అలవర్చుకొని హెల్మెట్ ప్రాముఖ్యతను గుర్తించి దానిని ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అడిషనల్ ఎస్పి సూచించారు. మార్చి 1నుండి జిల్లాలో మహిళ సాధికారిక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేస్తూ వచ్చి పోలీస్ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహించే మహిళ ఉద్యోగులకు శిఖేంద్రనాథ్ ఫౌండేషన్ సహకారంతో హెల్మెట్లను ప్రధానం చేసినట్లు తెలిపారు. సమాజ హితం కొరకు ముందుకు వచ్చి సమాజ సేవ చేసే వారికి పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటూ తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఫౌండేషన్ స్థాపకులు చంద్ర ప్రసాద్, చంద్ర మాధవీలత, డైరెక్టర్లు జితేంద్ర, భార్గవ, కొరపాటి చక్రధర్ ఇషాంత్, డెల్టా టుడే చీఫ్ ఎడిటర్ హరిబాబు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు హెల్మెట్‌లను అందించిన అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

మహిళా దినోత్సవ వారోత్సవాలు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బాలికలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లపట్ల సిడిపిఒ ఎం. అనసూయ మాట్లాడుతూ విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినుల చేత ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో కషి చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన బాలికలకు,21 సంవత్సరాలు నిండిన బాలురకు మాత్రమే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల వారు శారీరకంగా మానసికంగా వాళ్ళు సమస్యలు ఎదుర్కొంటారని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలన, లింగ వివక్షత, చదువు యొక్క ప్రాధాన్యత గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు కాటూరి లక్ష్మీనారాయణ, పోలేరమ్మ గుడి పూజారి శ్రీనివాస శర్మ, పాస్టర్ నిరీక్షణరావు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : మహిళా జాతీయ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా బాలికలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు సిఐ రమణయ్య తెలిపారు. ఎస్ఐ సురేష్ పర్యవేక్షణలో స్థానిక ఎన్ఆర్ అండ్ వి ఎస్ఆర్ బాలకోన్నత పాఠశాల,న ఆదర్శ పాఠశాలలో బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు అనంతరం కార్యాలయం వద్ద బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వాణిశ్రీ, హిమబిందు, వందన, సుమలత, బేబీ, ఉషా వాణి, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

బట్టిప్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

పర్చూరు : బాల్య వివాహాలు చేయరాదని సిడిపిఒ జి.సుభద్ర తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పర్చూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉప్పుటూరు హైస్కూల్ విద్యార్థుల సోమవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల రహిత సమాజం ఉండాలంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. బాల్యవివాహాలు లేని ఆంధ్రప్రదేశ్ కోసం సంతకాలు సేకరించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలు గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీలు, హై స్కూల్ విద్యార్థినులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అనే నినాదంతో అంగన్‌వాడీలు పోషణ్ 'బి' పడాయి 'బి' కార్యక్రమంలో భాగంగా సోమవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. భట్టిప్రోలు సెక్టార్ పరిధిలోని ఐలవరం గ్రామంలో అంగన్‌వాడీలు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్య, పోషక విలువల ప్రాధాన్యత, సంతకాల సేకరణపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ సంపూర్ణ, అంగన్‌వాడీలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- చెరుకుపల్లి

మండల పరిధిలోని కావూరు వినాయశ్రమం బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశానికి బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ మరియు జిల్లా కన్వీనర్ నాగమణి తెలిపారు. ఐదవ తరగతిలో ప్రవేశానికి మరియు 6 ,7 ,8 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి బాలికలు దరఖాస్తు చేసు కోవాలన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల మార్చి నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి- సంతమాగులూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎనుబర్ల యలమంద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జ్యోతిర్మయి తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయం, తాగునీటి పథకాలు, ఉద్యానవన శాఖ, సాగునీరు, పశు వైద్యం, ప్రజారోగ్యం, విద్యుత్, విద్య, గృహ నిర్మాణం, వెలుగు, నిత్యావసర సరుకులు, ఉపాధి హామీ, అంగన్‌వాడీ, రోడ్డు రవాణా, సాంఘిక సంక్షేమ శాఖలపై సమీక్షించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. సమావేశానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఎంపిడిఒ కోరారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - నిజాంపట్నం

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ ఎన్.నాగలక్ష్మి తెలిపారు. వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు 90 రోజుల పాటు కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. బీసీ, ఇడబ్ల్యూఎస్, ఈ బీసీలకు సంబంధించిన రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాల వయసు గల మహిళలు కుట్టు శిక్షణకు అర్హులని తెలిపారు. అర్హులైన మహిళలు తమ సమీప సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయులు

పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రి సోమవారం అందజేశారు. నగరం గ్రామానికి చెందిన ఉప్పల కాసులు, సైన్స్ టీచర్ పేటేరు వారు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు ప్యాడులు, పెన్నులు స్కేలు, ఎరేజర్, పెన్సిల్స్ అందజేశారు. మొత్తం 83 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడుకాటూరి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సింగరకొండ తిరునాళ్ల సందర్భంగా..

14న ట్రాఫిక్ మళ్లింపు : సిఐ

ప్రజాశక్తి - అద్దంకి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వార్షిక తిరునాళ్ల సందర్భంగా ఈనెల 14న ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు సిఐ ఆరాధ్యుల సుబ్బరాజు సోమవారం ఓ ప్రకటన తెలిపారు. హైదరాబాదు నుంచి ఒంగోలు వైపు వెళ్లే వాహనాలను సంతమాగులూరు జంక్షన్ వద్ద నుంచి నరసరావుపేట చిలకలూరిపేట మీదుగా ఒంగోలు వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. దర్శి వైపు వాహనాలను సంతమాగులూరు క్రాస్ రోడ్డు వద్ద నుంచి వినుకొండ, కురిచేడు మీదుగా దర్శికి మళ్లిస్తున్నట్లు తెలిపారు. రేణింగవరం నుంచి అద్దంకి మీదుగా దర్శి వైపు వెళ్లే వాహనాలను మేదరమెట్ల హైవే మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు వైపు నుంచి హైదరాబాదు వెళ్లే వాహనాలను మేదరమెట్ల, మార్టూరు హైవే మీదుగా గా హైదరాబాద్ వెళ్లాల్సి వస్తుందన్నారు. దర్శి నుంచి అద్దంకి మీదగా హైదరాబాదు వెళ్లే వాహనాలను కురిచేడు, వినుకొండ మీదగా సంతమాగులూరు క్రాస్ రోడ్డు మీదుగా మళ్లిస్తున్నట్లు సిఐ పేర్కొన్నారు.

చర్చి నిర్మాణానికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు నియోజకవర్గ పరిధిలోని కొల్లూరు మండలం చిలుమూరులంక గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి గ్రామానికి చెందిన సుగ్గన మల్లేశ్వరరావు లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. గ్రామ కమిటీ ఎంపిక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వైసిపి అధికార ప్రతినిధి వేమూరి నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు పాల్గొని దాత మల్లేశ్వరరావును అభినందించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు గ్రామాన్ని సందర్శించి నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిలుమూరులంక నూతన గ్రామ పార్టీ కమిటీని నియమించారు.నూతన ప్రధాన కార్యదర్శిగా తొడేటి పాల్ మార్క్, కార్యదర్శిగా మెరకనపల్లి రత్నాలు ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని తెలిపారు. వేమూరునియోజకవర్గంలో కార్యకర్తలు ఆధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటామని తెలిపారు. కొల్లూరు మండల అధ్యక్షుడు సుగ్గన మల్లేశ్వరరావు మాట్లాడుతూ చిలుమూరు లంకలో అసంపూర్తిగా నిలిచిపోయిన చర్చి నిర్మాణానికి తన వంతుగా లక్ష విరాళం ప్రకటించారు. నగదును మేలో గ్రామ కమిటీ సభ్యులకు అందజేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పేరికల పద్మారావు,భట్టిప్రోలు మండల అధ్యక్షుడు పడమట శ్రీనివాసరావు,గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు దివి వెంకటేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు శంకర్,సోషల్ మీడియా అధ్యక్షుడు తనీష్,కార్మిక సంఘం అధ్యక్షులు ఎన్.నాంచారయ్య గుంటురు పవన్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లేశ్వరరావు అభినందిస్తున్న అశోక్ బాబు

రోడ్డును చదును చేస్తున్న రోలర్

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- భట్టిప్రోలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు రాష్ట్ర డిమాండ్ చేశారు. స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచిపటికీ ఇంతవరకూ సంక్షేమ బోర్డు ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. సంక్షేమ బోర్డును ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ. 6,000 పెన్షను ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఒబులశెట్టి రమేష్, విష్ణుమొలకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అనగాని చొరవతో డొంక రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి- చెరుకుపల్లి

మండల పరిధిలోని రాంబట్లపాలెం నుంచి మోరవాగు పాలెం వెళ్లే మట్టి డొంక రోడ్డు గతుకులమయంగా మారింది. దీంతో రైతులు, స్థానికులు తీవ్ర ఇబ్బందు లకు గురవుతున్నారు. ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతునానరు. ఈ విషయం గురించి స్థానికులు మంత్రి అనగాని సత్యప్రసాద్ దష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సోదరుడు శివప్రసాద్ సహకారంతో రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు. సుమారు లక్షన్నర రూపాయల సొంత వ్యయంతో ఈ రోడ్డును నిర్మించారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్ట పట్ల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రవాణారంగ పరిరక్షణకు

'చలో పార్లమెంట్'ను జయప్రదం చేయాలి

ఆల్ఇండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్

మాట్లాడుతున్న గంటెనపల్లి శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రవాణా రంగ పరిరక్షణకు, కార్మిక చట్టాల అమలుకు మార్చి 24న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆల్ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. కేంద్రం అనుసరిస్తున్న విధానాల కారణంగా కార్మికుల పని పరిస్థితులు దుర్భరంగా మారాయన్నారు. సోమవారం నాడు స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడారు. కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్లు ప్రవేశపెట్టే ప్రక్రియ మోటార్ వర్కర్లకు శరాఘాతంగా పరిణమిస్తోందన్నారు ఏడాది పొడవునా, రేయనక, పగలనక 24 గంటలూ అత్యంత ప్రమాద భరితమైన డ్రైవింగ్ వృత్తిలో కొనసాగుతున్న ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ల సంక్షేమం కోసం కేంద్రం నిధులు కేటాయించడం, లేదా సంక్షేమ చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు నూతన వాహనచట్టం వేలిపై రోకటి పోటన్న చందంగా పరిణమిస్తోందని పేర్కొన్నారు. రవాణా కార్మికులు మార్చి 3 నుండి 20 వరకు మండల కేంద్రాల్లోని ప్రతి స్టాండ్‌లో గేటు మీటింగ్‌లు, కరపత్ర ప్రచారం, అధికారులకు అర్జీలు ఇవ్వటం వంటి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రచార కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు తంబి శ్రీనివాసులు, మున్నా భాషా పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

- సెకండియర్ పరీక్షలు ప్రారంభం
- పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎస్‌పి దామోదర్

పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. పరీక్షలలో భాగంగా సోమవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు/ సంస్కృతం పరీక్షను నిర్వహించారు. ఇంటర్మీడియేట్ పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ స్వయంగా పరిశీలించారు. విధులలో ఉన్న సిబ్బంది, పోలీస్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు.

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను 67 కేంద్రాలలో నిర్వహిస్తున్నారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 19213 మంది విద్యార్థులను కేటాయించగా 18450 మంది హాజరు కాగా 763 మంది గైర్హాజరయ్యారు. వీరిలో సాధారణ కోర్సులకు 17,252 మందిని కేటాయించగా 16659 మంది హాజరు కాఆ 593 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు 1961 మందిని కేటాయించగా 1751మంది హాజరు కాగా 170 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఆర్ఐఒ ఐదు కేంద్రాలలో, డిఇసి, డిఐఇఒ అధికారులు 15 కేంద్రాలలో తనిఖీలు నిర్వహించారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్వాడ్స్ 48 కేంద్రాలను పరిశీలించారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎస్‌పి

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న సందర్భంగా జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఒంగోలు సెయింట్ జేవియర్స్ స్కూలులో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి.. అక్కడ బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 67 ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా సమయంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలు తిరుగుతున్నాయన్నారు. ప్రశ్నాపత్రాల తరలింపు, సమాధాన పత్రాలు డిపాజిట్ చెయ్యడానికి తగిన ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేశామని, పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా జరగడానికి పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుందన్నారు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఏ పరీక్షా కేంద్రం వద్దయినా ఎటువంటి చిన్న ఘటన జరిగిన వెంటనే డయల్ 112/100 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ 9121102266 కు సమాచారం అందించాలని సూచించారు. జిల్లా ఎస్‌పి వెంట ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు వన్‌టౌన్ సిఐ నాగరాజు, ఒంగోలు తాలూకా ఎస్ఐ సందీప్, సిబ్బంది ఉన్నారు.

డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారు..

- ఇసుక యార్డు యాజమాన్యంపై చర్యలు తీసుకోండి
- ఒంగోలులో టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ ధర్నా

ధర్నా చేస్తున్న టిప్పర్ ఓనర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఇసుక యార్డుకు ఇసుక తోలించుకొని డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఒంగోలు టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పసుపులేటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపులేటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒంగోలు టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన కొంత మంది సభ్యులు నెల్లూరు నుంచి ఒంగోలు ఇసుక యార్డుకు గత 3 నెలల నుంచి ఇసుక తోలించుకున్నారన్నారు. రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా వారిని ఇసుక యార్డు చుట్టూ తిప్పుకుంటూ ఎటువంటి సమాదానం చెప్పటం లేదన్నారు. ఏమైనా అడిగితే మీకు దిక్కున్నచోట చెప్పుకోండని అంటున్నారని, టిప్పర్ల ద్వారా ఇసుక తీసుకోమని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. తక్కువ ధరలకు ఇసుక సరఫరా చేస్తే ఊరుకోబోమని, పోలీస్ అధికారులను ఉసిగొల్పి అసోసియేషన్ టిప్పర్లను కట్టడి చేస్తున్నారని చెప్పారు. ఇసుక తోలితే టిప్పర్లపై కేసులు బుక్ చేస్తామని, ఇసుక యార్డు వారితో మాట్లాడుకున్న తర్వాతే ఇసుక తోలాలని పోలీస్ అధికారులు బెదిరిస్తున్నారని వాపోయారు. టిప్పర్ ఓనర్స్ ట్యాక్స్‌లు కట్టలేక, డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేక, లారీ కిస్తీలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితికి వచ్చారన్నారు. అధికారులు తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరారు. తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. ధర్నా అనంతరం మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ ఈ విషయమై చర్యలు తీసుకోవాలని ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల, గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు టి.రాజశేఖర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వల్లెపు ఆంజనేయులు, కార్యదర్శి వేణుగోపాల్, సమాచార విప్ రవితేజ, కోశాధికారి భూపతి శ్రీను, నాయకులు ఆకుల మోహనరావు, బొల్లినేని రామారావు, బ్రిక్స్ సుబ్బారావు, ఓనర్లు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి

ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం నాడు అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం పున్నయ్య భవన్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షులు బి అంకిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సుబ్బారావు, కోశాధికారి ఎన్ఎస్ ప్రభాకర్ రావు మాట్లాడారు. పెన్షనర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 12వ పిఆర్సి కమిటీ నియామకంలో ప్రభుత్వం తీవ్రంగా జాప్యం చేస్తోందని దుయ్యబట్టారు. కమిటీ నియామకం అవసరమైనందున మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డిఏ, డిఆర్‌లను తక్షణం విడుదల చేయాలని కోరారు. చాలీచాలని పెన్షన్‌తో జీవనం సాగిస్తున్న పెన్షనర్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆప్కాస్ వ్యవస్థను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పొద్దని, గత సమ్మెకాల ఒప్పందాల జీవోలను విడుదల చేయాలని. కోరుతూ మార్చి ఐదున చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. సోమవారం నాడు సిఐటియు కార్యాలయంలో జరిగిన ఆ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాటాడుతూ ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడాన్ని కూటమి ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్వచ్ఛ-ఆంధ్ర, స్వచ్ఛ- విజన్ అమలు చేయాలని ఒక వైపు పిలుపునిస్తూ, మరో వైపు ఈ ప్రక్రియకు తలపెట్టడం సరికాదన్నారు. కార్మికులు పనిచేయకపోతే స్వచ్ఛఆంధ్ర ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లాలో కార్మికులందరూ అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నగర గౌరవాధ్యక్షులు టి.మహేష్, విజయమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, కె.సామ్రాజ్యం, ఎం.బాబు, జేమ్స్, బి.దివ్య, భారతి, కె.వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ ర్యాలీ

ప్రతిజ్ఞ చేస్తున్న ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఈ నెల 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం సంతనూతలపాడు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బంగారు బాల్యంపై కొవ్వొత్తుల ర్యాలీ, ప్రతిజ్ఞ, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ నెల 8న జరిగే మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పి.నాగలక్ష్మి, ఆర్ పార్వతి బాయి, వెలుగు ఏపిఎం టి బాబురావు, సీసీలు శ్రీనివాసులు, రామాంజనేయులు, ఈవోఆర్‌డి ఎం రమణమ్మ, మండల పరిషత్ ఏవో ఈదర విజయలక్ష్మి, మండల ఏపీవో వాసంతి, మండల పరిషత్, వెలుగు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు. మద్దిపాడు ప్రాజెక్టు ఐసిడిఎస్ సిడిపిఓ ఇమాంజలి పర్యవేక్షించారు.

నగరంలో ఫ్లెక్సీలకు అనుమతి లేదు..

కమిషనర్ వెంకటేశ్వరరావు

వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థలో డివైడర్లలో మొక్కలు నాటడం, రోడ్ల ఆధునీకరణ పనులు జరుగుతున్నందున నగరంలో ఎక్కడా కూడా ఎలాంటి ఫ్లెక్సీలు అనుమతించబడవని కమిషనర్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు అందరూ గమనించి ఒంగోలు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పాఠశాల, కళాశాలలోని విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'మహిళల సాధికారత, హక్కులు, సమానత్వం' వంటి అంశాలపై ఈ వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యాసరచన ద్వారా వ్యక్తీకరించారు. మార్చి ఎనిమిదిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మహిళా చట్టాలు, ఫోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు వినియోగించు విధానం, సైబర్ నేరాలు జరుగుతున్న తీరు మొదలగు వాటి గురించి వివరించి వాటి నుండి అప్రమత్తంగా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారులకు అత్యవసర సమయంలో సహాయం కోసం హెల్ప్‌లైన్ నెంబర్లకు కాల్ చేసి పోలీసులు సహాయం పొందాలన్నారు. బాలబాలికలకు సంబంధించిన సమస్యలకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, మహిళలకు సంబంధించిన సమస్యలకు ఉమెన్ హెల్ప్ లైన్ 181, పోలీస్ శాఖను సంప్రదించేందుకు పోలీస్ హెల్ప్‌లైన్ 112, సైబర్ నేరాలకు గురైతే సంప్రదించవలసిన సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930ను సంప్రదించాలని సూచించారు.